ప్రజాశక్తి

పార్లమెంట్‌కు 4, అసెంబ్లీకి 24

నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు

(2లో)

బుధవారం ఏప్రిల్ 24 2024 | 8 పేజీలు | శ్రీకాకుళం

రామ్మోహన్ నాయుడు, రవికుమార్‌లను గెలిపించాలని కోరుతున్న చంద్రబాబు నాయుడు



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

ఐటిడిఎ ఏర్పాటు చేస్తా

- నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- వంశధార ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు
- ప్రతి పనికీ తమ్మినేని, రెడ్డి శాంతికి ముడుపులు
- వారి భరతం పడతాను
- 'ప్రజాగళం' సభలో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పాతపట్నం, ఆమదాలవలస

జిల్లాలో గిరిజనుల కోసం ఐటిడిఎను ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. పాతపట్నంలోని ఆల్ ఆంధ్రా రోడ్డు, ఆమదాలవలసలోని కృష్ణాపురం కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. వంశధార - నాగావళి నదుల అనుసంధానం తన కల అని, అధికారంలోకొచ్చాక వాటిని పూర్తి చేస్తానని చెప్పారు. వంశధార ప్రాజెక్టుతో నష్టపోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తానన్నారు. ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఎంత మేలు చేకూరుతుందో, వాటి కోసం భూములు ఇచ్చి నష్టపోయిన రైతులకూ పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని, ఆ బాధ్యత తాను తీసుకుంటానని హామీనిచ్చారు. జగన్ ఐదేళ్ల పాలనలో వంశధార ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన (మిగతా...2లో)

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నీటిఎద్దడి నివారణకు ప్రణాళికలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేసవిలో జిల్లాలో మంచినీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. వేసవిలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరాకు ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న రోజులలో వేడి గాలులు ఎక్కువగా వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఉపాధి హామీలో నీటిసంరక్షణ, మంచినీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఉండరాదని ఆదేశించారు.

కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో తలెత్తే ఇబ్బందులను 24 గంటల్లో పరిష్కరిస్తున్నామన్నారు. అంతకుముందు ఆయన గొట్టాబ్యారేజీలో నీటి నిల్వల గురించి వంశధార అధికారులతో మాట్లాడారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఇఇ ఎల్.సి.హెచ్ పాత్రుడు, డిపిఒ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, వంశధార ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇంజినీర్ పి.సుగుణాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జాన్ బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిఎం జగన్ పర్యటన

టెక్కలిలో 'సిద్ధం' ముగింపు సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈనెల 24వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను టెక్కలిలో ముగిస్తారు. ఆయన మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఎచ్చెర్లలోని అక్కివలసలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు బస్సు యాత్రను ప్రారంభం కానుంది. రోడ్‌షోగా ఎచ్చెర్ల, కుశాలపురం, శ్రీకాకుళం బైపాస్, పల్లివలస, నరసన్నపేట క్రాస్‌రోడ్డు, గట్లపాడు, వాండ్రాడ, ఎత్తురాళ్లపాడు, కోటబొమ్మాళి మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు టెక్కలి మండలం పరశురాంపురం కూడలికి (మిగతా...2లో)

భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం

- ఎన్నికల్లో రాజకీయ పార్టీల వైఖరి స్పష్టం చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం ద్వారా అమలు చేయాల్సిన సంక్షేమాన్ని నిలిపివేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కార్యదర్శి మంతెన హరనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్మాణ కార్మికులపై వాటి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘ కోశాధికారి మాచెర్ల చక్రధర్, ఎ.కామేశ్వరరావుతో కలిసి (మిగతా...2లో)

మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ఆ పార్టీలకు చరమగీతం పాడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- ఎన్నికల మేనిఫెస్టో విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. మతతత్వ బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపినీ ఈ ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టడం ఎవరిని మోసం చేయడానికని ప్రశ్నించారు.

దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరల్ వ్యవస్థను పథకం ప్రకారం బిజెపి ధ్వంసం చేస్తోందని, పౌర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రోడ్లు, పోర్టు, విద్యుత్, ఆయిల్ సెక్టార్, రైల్వే తదితర ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేసిందన్నారు. ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంపదగా మార్చేస్తోందని విమర్శించారు. అటవీ హక్కుల (మిగతా...2లో)

నేడు తీవ్ర వడగాలులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా బుధవారం 13 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. 16 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు.

తీవ్ర వడగాలులు వీచే మండలాలు

ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం, పొందూరు, సరుబుజ్జిలి, నరసన్నపేట, జలుమూరు, టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట.

వడగాలులు వీచే మండలాలు

శ్రీకాకుళం, సోంపేట, రణస్థలం, సంతబొమ్మాళి, పోలాకి, పలాస, లావేరు, గార, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, కొత్తూరు, మందస, నందిగాం, మెళియాపుట్టి.

జిల్లాలో సారవకోట మండలంలో మంగళవారం 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు. 20 మండలాల్లో తీవ్ర వడగాలులు, ఏడు మండలాల్లో వడగాలులు వీచాయని పేర్కొన్నారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి (మిగతా...2లో)

టెక్కలి బరిలో దానేటి

నేడు నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

టెక్కలి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. ఈనెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పత్రికా కార్యాలయాలకు ఫోన్ చేసి చెప్పారు. టెక్కలి నియోజకవర్గంలోని లింగాలపాడులో సమావేశం నిర్వహించి తన కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ను ఓడించడమే లక్ష్యంగా తాను బరిలో దిగుతున్నానని, ఇందులో తన గెలుపోటములను పట్టించుకోనన్నారు. (మిగతా...2లో)

పార్లమెంట్‌కు నాలుగు, అసెంబ్లీకి 24

నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆరో రోజు మంగళవారం శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 19 మంది 24 సెట్ల నామినేషన్లు వేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్ తరుపున ఎం.వి స్వరూప్ మూడో సెట్ నామినేషన్‌ను కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి మనజీర్ జిలానీ సమూన్‌కు అందించారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి ఇప్పిలి సీతరాజు మరో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు చెల్లూరి డేనియల్, సనపల శ్రవణ్‌కుమార్ ఒక్కో సెట్ నామిసేషన్ వేశారు.

ఇచ్ఛాపురం అసెంబ్లీ స్థానానికి బిఎస్‌పి అభ్యర్థి వేదవర బిసాయి నామినేషన్ వేశారు. పలాస అసెంబ్లీ స్థానానికి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థి పి.కామేశ్వరరావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. టెక్కలి అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు మరో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి కింజరాపు విజయ మాధవి నామినేషన్ వేశారు. బిఎస్‌పి అభ్యర్థిగా చింతాడ శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. పాతపట్నం అసెంబ్లీ స్థానానికి ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కొప్పరోతు వెంకటరావు, స్వతంత్ర అభ్యర్థులు రాజాన మోహనరావు, బగ్గు కృష్ణ, గొండ్వా దండకారణ్య పార్టీ అభ్యర్థి జన్ని సంజీవరావు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి గొల్ల తిరుపతిరావు నామినేషన్లు వేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి పిరమిడ్ పార్టీ అభ్యర్థి కర్రి లక్ష్మణ నామినేషన్ దాఖలు చేశారు.

ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ రెండు సెట్లు, డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి కూన ప్రమీల ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ అభ్యర్థి ముద్దాడ మధుసూదనరావు, స్వతంత్ర అభ్యర్థి సనపల సురేష్ కుమార్ నామినేషన్లు వేశారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా గొర్లె కిరణ్‌కుమార్, సువ్వారి రమ్య నామినేషన్లు దాఖలు చేశారు. నరసన్నపేట అసెంబ్లీ స్థానానికి వైసిపి అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థి కాయ కామేశ్వరి నామినేషన్లు వేశారు.

నేటి నుంచి వేసవి సెలవులు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు నేటి నుంచి మూతపడనున్నాయి. ఈనెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. 12న పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయి. సుమారు 50 రోజులు పాటు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. సెలవుల నేపథ్యంలో పిల్లలు ఊర్లు వెళ్లేందుకు, ఎంజాయ్ చేసేందుకు రెడీ అవుతున్నారు. పరీక్షల ఒత్తిడి నుంచి బయటపడి.. ట్రిప్స్ వేసేందుకు తల్లిదండ్రులకు వెళ్లాల్సిన ప్రాంతాల జాబితాను చెప్తున్నారు.

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి క్లాసుల వారీగా అమలు చేయాల్సిన అంశాలపై మార్గదర్శకాలను వెలువరించింది. 'సెలవుల్లో సరదాగా-2024' పేరుతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని పిఇటిలకు సూచించింది. విద్యార్థుల్లో పుస్తకాలు చదవడం మీద ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉయ్ లవ్ రీడింగ్ పేరిట కాంపిటీషన్ నిర్వహించాలని సూచించింది. విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాలతో పాటుగా క్రీడలు, వృత్తి నైపుణ్యం, సజనాత్మక కళలపై ఫోకస్ పెట్టాలని పేర్కొంది. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కూడా ఇందులో పాల్గొనాలని సూచించింది. ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనే చేరేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఐటిడిఎ ఏర్పాటు చేస్తా

వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి సాగు, తాగునీటిని అందిస్తామన్నారు. దేశంలో ఎక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నా కూలీలుగా శ్రీకాకుళం జిల్లా వారే ఉంటున్నారని, అందులో పాతపట్నం వారే అధికంగా ఉన్నారని తెలిపారు. పాతపట్నం ప్రాంతంలో ఐటిఐ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే ఇక్కడ యువతే మంచి సేవలు అందిస్తారని చెప్పారు. పాతపట్నంలో వంద పడకల ఆస్పత్రి, మహిళా డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. పాతపట్నం నుంచే పనిచేసే వర్క్ ఫ్రం హోం తీసుకొస్తామని చెప్పారు. ఆమదాలవలసలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వద్ద వంశధార నదిపై వంతెన నిర్మిస్తామన్నారు. నారాయణపురం ఆనకట్ట ఆధునీకరణ, ఐటి హబ్ ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు.

తమ్మినేనిని విడిచిపెట్టేది లేదు

ఈ ఎన్నికల్లో ప్రజలు కొట్టే దెబ్బకు డమాబుస్ సీతారాం ఒడిశా పారిపోతారని, అయినా విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. స్పీకర్ పదవికి తమ్మినేని అనర్హుడని, జగన్ చెప్పే పనులకు గంగిరెద్దులా తలూపడం తప్ప చేసిందేమీ లేదన్నారు. సైకో మాటలకు తలూపి స్పీకర్ స్థానాన్ని అప్రతిష్టపాలు చేశారని ధ్వజమెత్తారు. తమ్మినేని నియోజకవర్గం మొత్తాన్ని ఊడ్చేశారన్నారు. ఏ పని చేయాలన్నా వారి కుటుంబ సభ్యులకు బంగారు కానుకలు సమర్పించాల్సిందేనని ఆరోపించారు. నాగావళి, వంశధార నదుల్లోని ఇసుక మొత్తం ఊడ్చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇక్కడి వారికి ఇసుక దొరకదు. కానీ కావాల్సినంత విశాఖకు తరలిస్తున్నారని చెప్పారు. ఉద్యోగుల బదిలీలకు రేట్ ఫిక్స్ చేశారని ఆరోపించారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కాంట్రాక్టు పనులలో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. కాంపౌండ్ వాల్ నిర్మించుకోవాలన్నా ఆమెకు కమీషన్ ఇవ్వాల్సిందేనన్నారు. వంశధార నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వారి భరతం పడతానన్నారు. వైసిపి నాయకులు బిర్యానీ, క్వార్టర్ మందు ఇచ్చినా ప్రజలు అవి తీసుకొని టిడిపికే ఓటు వేస్తారని చెప్పారు. టిడిపి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు మామిడి గోవిందరావు, కూన రవికుమార్‌ను గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని గాలికొదిలేశారు : రామ్మోహన్ నాయుడు

పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే రెడ్డి శాంతి గాలికొదిలేశారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. జిల్లాలను విడదీసిన జగన్ శ్రీకాకుళం జిల్లాకు ఐటిడిఎ కేంద్రం లేకుండా చేశారన్నారు. వంశధార నిర్వాసితులకు 2013 చట్టం అమలు చేయకుండా వారికి మోసం చేశారని విమర్శించారు. ఆమదాలవలస-శ్రీకాకుళం తొమ్మిది కిలోమీటర్ల ప్రధాన రహదారిని నిర్మించుకోలేని వైసిపి నాయకులు ప్రజల జీవితాలను బాగుచేస్తారా అని ప్రశ్నించారు. వలసలను నిరోధించడానికి ఆమదాలవలస నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.

వైసిపికి ఓటు వేస్తే వినాశనం : రవికుమార్

రాష్ట్రాభివృద్ధి కోసమైతే టిడిపికి, వినాశనం కోసమైతే వైసిపికి ఓటు వేయాలని ఆమదాలవలస అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. గత ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ అంటే జగన్‌కు, లాస్ట్ ఛాన్స్ అంటే తమ్మినేనికి ఓటు వేసి అరాచక పాలనకు అవకాశం ఇచ్చారన్నారు. మరోసారి అలాంటి తప్పు చేయొద్దన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని, తమ్మినేని మాత్రం అవినీతి, అక్రమాలతో అభివృద్ధి చెందారని ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జా : ఎంజిఆర్

పాతపట్నం నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గమని ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు తెలిపారు. ఇక్కడ విద్య, వైద్యం, మౌలిక వసతులు లేవన్నారు. ఉపాధి లేక ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరులో ఏర్పాటు చేయాల్సిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఇక్కడి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాలకొండకు తరలించారని చెప్పారు. పాతపట్నంలోని ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జా గురవుతున్నాయని ఆరోపించారు.

పాతపట్నం నీలమణి దుర్గ గుడి నుంచి ఆల్ ఆంధ్ర రోడ్డు వరకు చంద్రబాబు నాయుడు రోడ్‌షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, పాతపట్నం నాయకులు పైల బాబ్జీ, జనసేన పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య, సలాన మోహనరావు, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం అవస్థలు

పాతపట్నంలో చంద్రబాబు నాయుడు పర్యటనలో జనం పలు అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం, టెక్కలి నుంచి వచ్చే బస్సులను కిలోమీటరు దూరం నుంచే ఆపేశారు. మండుటెండలోనే వృద్ధులు, చిన్నారులు నడుచుకుంటూ ఇబ్బందులు పడ్డారు.

నేడు సిఎం జగన్ పర్యటన

చేరుకుంటారు. అక్కడ భోజన విరామం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు పరశురాంపురం కూడలి నుంచి బయలుదేరి కె.కొత్తూరు మీదుగా అక్కవరం చేరుకుంటారు. అక్కడితో ఆయన బస్సు యాత్రను ముగిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం సభాస్థలికి 4.20 గంటలకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 5.20 గంటలకు అక్కవరం సభాస్థలి నుంచి తిరిగి బయలుదేరి 5.25 గంటలకు హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. 5.30 గంటలకు హెలీకాప్టరులో బయలుదేరి 6.15 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ్నుంచి 6.30 గంటలకు విజయవాడ వెళ్తారు.

నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం

మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం అమలవుతోందని, రాష్ట్రంలో మాత్రం అమలు కావడం లేదని తెలిపారు. కార్మిక చట్టాలను అనుసరించి నిర్మాణదారుల నుంచి నిర్మాణ విలువలో వసూలు చేస్తున్న ఒక శాతం సెస్ రూ.వేల కోట్లు ఉందన్నారు. ఆ నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో నవరత్నాల పథకాలు అమలు కావడం వల్ల నిర్మాణ కార్మికులకు ప్రత్యేక పథకాలు అవసరం లేదనడాన్ని ఆక్షేపించారు. సామాన్యులకు ఇస్తున్న పథకాలకు, నిర్మాణ కార్మికులకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాల మధ్య వ్యత్యాసం ఉందన్నారు. సంక్షేమ పథకాలు ప్రభుత్వ నిధులతో అమలు చేయాల్సి ఉందని, కార్మికుల నిధిని దారిమళ్లించి కాదన్నారు. నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు భవన నిర్మాణ యజమాని నుంచి వసూలు చేస్తున్న సంక్షేమ నిధి నుంచి అమలవుతాయని, వీటి వల్ల ప్రభుత్వ ఖజానాపై పైసా భారం ఉండదన్నారు. నవరత్నాలు నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టానికి ఎంతమాత్రం ప్రత్యామ్నాయం కాదన్నారు. అందువల్ల కార్మిక సంక్షేమ చట్టాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేలాది క్లెమ్‌లు చెల్లిస్తామని, నిర్మాణ సంక్షేమ నిధిని నిర్మాణ కార్మికుల కోసం మాత్రమే ఖర్చు చేస్తామని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌పై సానుకూలంగా స్పందించే రాజకీయ పార్టీలకే భవన నిర్మాణ కార్మికుల మద్దతు ఉంటుందన్నారు.

టెక్కలి బరిలో దానేటి

లింగాలపాడులో తన మామ సంపతిరావు రాఘవరావు కుటుంబ మద్దతు కూడా తనకే ఉందన్నారు. కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ సతీమణి వాణి వైసిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో దువ్వాడ తరుపున వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మధ్యవర్తిత్వం నడిపి ఆ నిర్ణయాన్ని వాణి ఉపసంహరించుకునేలా చేశారు. ఇప్పుడు దువ్వాడ తోడల్లుడు దానేటి శ్రీధర్ ఆయనపై పోటీ చేస్తానని ప్రకటించడం గమనార్హం. వైసిపిలో సుదీర్ఘ కాలం కొనసాగిన దానేటి, ఆ పార్టీ ఎంపీ టిక్కెట్‌ను ఆశించారు. ఆయనకు టిక్కెట్ కేటాయించకపోవడంతో, వైసిపిని వీడి జనసేనలో చేరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నామినేషన్ కార్యక్రమానికి పిఠాపురం వెళ్లిన ఆయన, అక్కడ్నుంచే ఫోన్ చేసి తాను ఎన్నికల బరిలో నిల్చొంటున్నట్లు తెలిపారు. జనసేన కూడా ఎన్‌డిఎలో భాగస్వామి కావడంతో, తాను కూటమికి అనుకూలంగానే వ్యవహరిస్తానని చెప్పారు. టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు అండదండలు ఉన్నాయని, తాను కేవలం దువ్వాడ ఓటమి కోసమే పోటీ చేస్తున్నానని తెలిపారు.

నేడు తీవ్ర వడగాలులు

సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంట్లోనే ఉండాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆ పార్టీలకు చరమగీతం పాడాలి

చట్టాన్ని రద్దు చేసి, గిరిజనుల భూములకు రక్షణ లేకుండా చేసిందని చెప్పారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సంపాదించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా బిజెపి ప్రభుత్వం చేసిందని విమర్శించారు. కొండలను గనులను అంబానీ, అదానీకి ధారాదత్తం చేస్తోందన్నారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేదు సరే కదా భూములు అంబానీ, అదానీకి అప్పగించేస్తున్నారని విమర్శించారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్పించి 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి పాల్గొన్నారు.

మద్యం అక్రమ నిల్వలు స్వాధీనం

వైసిపి నాయకులు పైడి మహేశ్వరరావు అరెస్టు

శ్రీకాకుళం : నగరంలోని గారవీధిలో వైసిపి నాయకులు, డాక్టర్ పైడి మహేశ్వరరావు నివాసంలో మద్యం అక్రమ నిల్వలను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఇంట్లో మద్యం సీసాలను అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 384 క్వార్టర్ బాటిళ్లను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వాటిని స్వాధీనం చేసుకొని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఇంటి యజమాని అయిన పైడి మహేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం అక్రమంగా నిల్వం చేయడంపై కేసు నమోదు చేసి విచారణను చేపట్టారు. ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిల్స్‌ను ఆయన ఎక్కడ నుంచి కొనుగోలు చేసి తరలించారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేశారా?, బార్లలో గంపగుత్తుగా కేసులు కొని ఎన్నికల కోసం ఉంచారా? అన్న విషయాలపై పోలీసులు విచారణను చేపడుతున్నారు. ఈ ఘటనతో ఇలా నిల్వ చేసిన వ్యక్తులు అప్రమత్తమైనట్లు చర్చ సాగుతోంది.

CHANGE OF NAME

I, **BONGU RAVI,** S/o BONGU BHOGIRAJ (OLD NAME), Resident of PALAVALASA Village, PALAVALASA (PO), SOMPETA MANDAL, Srikakulam Dist, AP State.
I have changed my father name is **BONGU BOGI RAJU** (NEW NAME) and my address is PALAVALASA Village, PALAVALASA (PO), SOMPETA MANDAL, Srikakulam Dist, AP State. HEREAFTER MY FATHER NAME IS KNOWN AS **BONGU BOGI RAJU**(NEW NAME).

వేసవిలో వడదెబ్బ ప్రమాదం

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఎండలు మండుతున్నాయి. మే నెల రాకుండానే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటేస్తున్నాయి. భానుడి భగభగలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండలో కాలు బయట పెట్టాలంటే జంకే పరిస్థితి నెలకొంది. వేడిగాలుల తీవ్రత పెరిగిన ప్రస్తుత తరుణంలో వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వడదెబ్బ అంటే ఏమిటి? దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పరిశీల్దాం.

వడదెబ్బ అంటే ఏమిటి

శరీరం అధిక ఉష్ణోగ్రతకు గురైనప్పుడు శరీరపరమైన, నాడీ పరమైన సమస్యలు తలెత్తుతాయి. అధిక ఉష్ణోగ్రత, డీ హైడ్రేషన్‌కు గురైనప్పుడు చర్మం, ఊపిరితిత్తులు సరిగా పనిచేయవు. దీంతో శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా అధిక స్థాయికి చేరుతుంది. దీనినే వడదెబ్బ లేదా హీట్ స్ట్రోక్ లేదా సన్‌స్ట్రోక్ అంటారు. వేసవిలో చిన్నపిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు, రోజువారీ కూలీలు, శ్రమజీవులు,ఆరుబయట పనిచేసే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.

వడదెబ్బ లక్షణాలు

ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే వేసవిలో బయట తిరిగేవారు, పనిచేసేవారు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. వడదెబ్బ తగిలితే తలనొప్పి రావడం, తల తిరగడం, తీవ్రమైన జ్వరం వస్తాయి. ఫిట్స్ వచ్చే అవకాశం ఉంటుంది. శరీరం పొడి బారటం, దప్పిక ఎక్కువ కావడం, వాంతులు కావడం, నీరసం, దడ, ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం, కన్ఫ్యూజన్, చిరాకు, ఉన్న స్థలం, సమయం తెలియకపోవడం, భ్రమలతో కూడిన ఆలోచనలు కలగడం, చివరిగా కొన్నిసార్లు ఆ వ్యక్తి స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

ముందుగా వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీటితో కానీ అందుబాటులో ఉంటే ఐస్ క్లాత్లో ఒళ్లంతా తుడవాలి. బాధితుడి చుట్టూ గుమిగూడకుండా చల్లని గాలి తగిలేలా చూసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి చల్లని నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి బోండాం లేదా ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ తాగించాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం అధికంగా ఉంటుంది. అందుకే రోజుకు కనీసం 10 నుంచి 15 గ్లాసుల నీరు తాగడం మంచిది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకపోవడమే మంచిది. బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లొద్దు. అత్యవసరమై బయటకు వెళ్తే టోపీ ధరించి వెళ్లాలి. మహిళలు స్కార్ఫ్ ధరించాలి. గొడుగు తీసుకెళ్లాలి. కూలింగ్ కళ్లద్దాలు పెట్టుకోవాలి. ఎండవేడికి చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే బయటకు వెళ్లినా మంచినీరు, మజ్జిగ, జ్యూస్, చెరకు రసం, కొబ్బరినీటిని తాగాలి. వేసవి కాలంలో నలుపురంగు, మందంగా ఉండే దుస్తులు ధరించడం మంచిది కాదు. లేత రంగులో, వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీలు, కూల్‌డ్రింక్స్ తాగకూడదు. ఉప్పు, కారం, నూనె ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోకూడదు. బయటకు వెళ్లినప్పుడు ఎండ ఎక్కువగా ఉండి అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నీడ, చల్లని ప్రదేశంలో ఉండాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు పూర్తి చేసుకోవాలి. ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి. మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయలను ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. వీటిని ఆహారంగా తీసుకోవాలి. షుగర్ ఎక్కువగా ఉండే కూల్ డ్రింక్స్, గ్యాస్ ఎక్కువగా ఉండే సోడాలు, టీ, కాఫీలు తాగకూడదు. ధూమపానం, మద్యపానం అలవాట్లకు దూరంగా ఉంటే మంచిది.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు

మృతి చెందిన గొల్లారావు

మండలం లోని కొత్తకుంకాం పంచాయతీ పెదయావలసకు చెందిన పీరుకట్ల గొల్లారావు (32) పురుగులు మందు తాగి మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు గొల్లారావు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవలు చేస్తూ పని చేయకుండా తిరుగుతూ, తాగుతూ వుండే వాడు. భార్యతో ఎప్పటికప్పుడు నేను చనిపోతాను అంటూ ఉండేవాడు. సోమవారం సాయంత్రం గ్రామంలోనే పురుగులు మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబీకులు గుర్తించి వెంటనే 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, రెండేళ్ల కుమారుడు, రోజులు గడుస్తున్న బాబు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యాను

ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస సుభద్రపురం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ప్రయాణికులతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం బలంగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మొత్తం పదిమంది ప్రయాణికులు గాయపడగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరు విజయనగరం నుంచి శ్రీకాకుళం వస్తున్నారు. వీరిలో వి.స్వర్ణలత, ఎంబిఎస్ భ్రమరాంబిక, కె.పద్మావతిలు ఎచ్చెర్లలోని గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ విధులకు వస్తున్నారు. వీరికి కాళ్లు, చేతులు, శరీరానికి తీవ్రంగా గాయాలయ్యాయి. అలాగే సాయి ప్రవల్లిక తీవ్రంగా గాయపడ్డారు. ఈమె శ్రీకాకుళంలోని డెంటల్ కళాశాలలో డెంటల్ విద్యను అభ్యసిస్తుంది. పాలకొండకు చెందిన కె.గజలక్ష్మి గాయపడ్డారు. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే చేరుకొని వాహనంలో చిక్కుకు పోయిన వారిని బయటకు తీసి రణస్థలం, లావేరుకు చెందిన రెండు 108 వాహనాల్లో శ్రీకాకుళంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెయ్యి లీటర్ల ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని హడ్డివాడలో టెక్కలి ఎక్సైజ్ సిఐ జి.రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యాన సారా తయారీ స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సారా తయారీ వల్ల కలిగే నష్టాలను వివరించారు. అందుకు సారా తయారీ మానుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూచనలు చేశారు.

స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

శిరీషను గెలిపించాలి

ప్రజాశక్తి- పలాస

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు కోరారు. పలాస 26 వార్డులో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు శిరీష ఎమ్మెల్యేగా గెలిపిస్తే మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. ప్రతి వార్డులోనూ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తంగుడు ఆశారాణి, తంగుడు ఆశాకిరణ్, టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, పైల చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి అభ్యర్థికి బి-ఫామ్

కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గ బిఎస్‌పి అభ్యర్థి పారాపురానికి చెందిన బొడ్డేపల్లి కృష్ణారావు బి-ఫామ్ అందుకున్నారు. విశాఖపట్నంలోని బిఎస్‌పి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.పూర్ణచంద్రరావు బి-ఫామ్‌ను మంగళవారం అందజేశారు.

సిద్ధం సభను విజయవంతం చేయాలి

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం టెక్కలిలో నిర్వహించనున్న సిద్ధం సభలో వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి అధికారంలోకి వస్తేనే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతో మరిన్ని పథకాలు అమలవుతాయని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కామేశ్వరరావు నామినేషన్

ప్రజాశక్తి- పలాస

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోతనపల్లి కామేశ్వరరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు మద్దిల మల్లేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, జిల్లా కమిటీ సభ్యులు కుత్తుం దుష్యంత్, మద్దిల క్రైలాస్‌లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, పోతనపల్లి అప్పారావు, మద్దిల రాజారావు, పోతనపల్లి సుందరమ్మ, గేదెల జగదీష్, గేదెల యశోద, మద్దెల కమలమ్మ, పిన్నింటి నాగేశ్వరరావు, కుత్తుం లోకనాథం, నెయ్యల రామకృష్ణ పాల్గొన్నారు.

బిఎస్‌పి అభ్యర్థుల నామినేషన్

నందిగాం: బహుజన సమాజ్ పార్టీ టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా దేవలభద్ర సర్పంచ్ ప్రతినిధి చింతాడ శ్రీనివాసరావు మంగళవారం తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు మంగళవారం అందజేశారు. ఈయనతో పాటు బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠం, టెక్కలి మండల కన్వీనర్ డి.సూర్యనారాయణ ఉన్నారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం : బహుజన సమాజ్ వాదీ పార్టీ తరపున ఎన్నికలో పోటీ చేయడానికి వేదవర బిసాయి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొరకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం మొత్తం నాలుగు నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్‌కి ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంది.

మండుతున్న ఎండలు

అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- టెక్కలి

వేసవి తీవ్రత ఉష్ణోగ్రతల వేడిమి రోజురోజుకూ పెరుగుతుంది. పగటి ఉష్ణోగ్రతల వేడిమి వాతావరణం వల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు నిత్యావసరాల నిమిత్తం తిరిగేందుకు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు వేసవి తీవ్రత తగ్గడం లేదు. రెండు రోజుల నుంచి రాత్రి పూటగా వేడిగా ఉండడంతో జనం అతలాకుతలం అవుతున్నారు. మధ్యాహ్నం జనాలు లేక షాపులు మూసివేయడంతో ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా తయారైంది. చిరువ్యాపారులు వ్యాపారాలు మనుకుని అండర్ పాసేజ్ కింద సేదతీరుతున్నారు. అలాగే మూగజీవాలు సైతం సేదతీరేందుకు చెట్ల కిందకు వెళ్తున్నాయి.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరరీ క్లబ్ ప్రారంభం

టెక్కలి రూరల్ : ఆదిత్య ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలలో 'ఆంగ్ల సాహితీవేత్త విలియం షేక్స్పియర్' జయంతిని పురస్కరించుకుని 'ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరరీ క్లబ్‌'ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంగ్ల భాష గొప్పతనం, ఉద్యోగకల్పనలో ఆ భాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస్, బిఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ శాంతికుమార్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డు నుంచి మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాతాళ తారక, వెంకటేష్, జగన్, మల్లేష్, ఈశ్వరరావు, తిరునాథ్, అనిల్ ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో బాబూరావు

అచ్చెన్న సతీమణి నామినేషన్ దాఖలు

టెక్కలి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు సతీమణి విజయ మాధవి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్‌కు మంగళవారం అందజేశారు. సాదాసీదాగా ఆమె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ పత్రాన్ని అందించారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ భవిష్యత్, భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 118వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా మంగళవారం దీక్షలో జల్లుపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ బెంతుఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర పరిధిలో పెద్దపాడుకు చెందిన వైసిపికి చెందిన పలువురు మంగళవారం విశాఖ ఎ కాలనీలో ఉన్న టిడిపి నియోజక వర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో టిడిపిలో చేరారు. నక్క రాము, బొట్ట కామరాజుల ఆధ్వర్యాన ఈ చేరికలు జరిగాయి. వారికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. పెద్ద ఎత్తున చేరికలు జరగడం ఆనందంగా ఉందన్నారు. కూటమిపై నమ్మకం, చంద్రబాబుపై విశ్వాసంతో పార్టీలోకి వస్తున్న వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ మూకళ్ల శ్రీను, రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో శంకర్

ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

టిడిపి అభ్యర్థి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల వరహాలగెడ్డ పై వంతెన నిర్మాణం చేపడతామని పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గత ఎన్నికల ముందు ఇచ్చాన హామీ ఏమైందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ప్రశ్నించారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టి బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం కోసం మాయమాటలు చెప్పినదాన్ని కాదు, ఇప్పుడు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పూర్తి చేస్తానని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో పంట భూములకు ఐదేళ్లుగా వంశధార నీరు అందించలేకపోయిందని అన్నారు. మంత్రి అప్పలరాజు నియోజకవర్గంలోని కొండలు, గుట్టలు సైతం ఆక్రమించి దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామ శివారున ఉపాధి హామీ కూలీలతో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాత్రి మండలంలోని కొబ్బరిచెట్టూరు, చిన్నగురుదాసుపురం, కొండవూరు, సాయినగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, వడ్డీ యాదగిరి, రఘుపాత్రుని సుధాకర్, ఆళ్ల కృష్ణారావు, ఆళ్ల వెంకటరావు, యర్ర సిమ్మన్న, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

కవిటి : 'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న విజయ

నియోజకవర్గ అభివృద్ధి కృషి

ప్రజాశక్తి- కవిటి

వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, గత ఐదేళ్లుగా సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత సిఎం జగన్‌దేనని ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండలంలోని శిలగాం, కరాపాడు పంచాయతీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. వైసిపి నాయకులు ఎన్.బాబూరావు, దేవరాజుసాహు, యలమంచి నీలయ్య, ఎన్ని అశోక్, ఎం.లచ్చయ్య, కడియాల హేమలత, పద్మనాభం, కె.వల్లభరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఏడో వార్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఊలాల దివ్యభారతి, లాభాల స్వర్ణమణి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, సాలిన ఢిల్లీరావు, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, పరపతి మంజులత, కోటి, బి.జగన్నాయకులు, పిలక సంతు పాల్గొన్నారు.

ఎన్నికల యజ్ఞం

ఎలక్షన్ విధుల్లో ఉద్యోగులే కీలకం

ఎన్నికల విధులంటే కత్తిమీద సాములాంటిదే. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడం పౌరుల బాధ్యత. ఇందుకోసం ఎన్నికల యంత్రాంగం రోజుల తరబడి శ్రమిస్తుంది. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం వారికి పెద్ద సవాలే. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల నుంచి వేలాది మంది ఉద్యోగులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతారు. ఉద్యోగుల విధులు ఎన్ని దశల్లో ఉంటాయో తెలుసుకుందాం.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం

☞ రిటర్నింగ్ అధికారులు

జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఒ)ని నియమించారు. వీరికి అనుబంధంగా ఎఆర్‌ఒలు ఉంటారు. ఓటర్ల జాబితాలో రూపకల్పనలో వీరు పాల్గొంటున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన బాధ్యత వీరిదే. ఇవిఎంలను, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో ఆర్‌ఒలదే ప్రధాన బాధ్యత.

☞ రూట్ ఆఫీసర్లు

పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని చేర్చే బాధ్యత వీరిదే. పోలింగ్ సిబ్బందికి వీరు మార్గదర్శకం చేస్తారు. మారుమూల ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, సిబ్బంది తరలింపు కోసం రవాణా ఇబ్బందులను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. పోలింగ్ పూర్తయ్యాక ఇవిఎంలను స్ట్రాంగ్ రూములకు చేర్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటారు.

☞ ఎంసిఎంసి బృందాలు

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీతో సహాయ సంచాలకులు ఉంటారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు అనుగుణంగా కుల, మతాలపై, సంఘాలపై విమర్శలు, దాడులు, వ్యక్తిగత దూషణలపై ఈ బృందం నిఘా వేస్తుంది. పత్రికలు, ఛానళ్లలో వచ్చే కథనాలను పరిశీలించి అభ్యంతరకర అంశాలపై నివేదిక తయారు చేసి జిల్లా అధికారికి సమర్పిస్తారు.

☞ నోడల్ అధికారులు

ఒక్కో నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారి ఉంటారు. పత్రికా సమాచారం, పోలింగ్ సిబ్బందికి ఆహారం సరఫరా వంటి బాధ్యతలు చూస్తారు.

☞ లైజన్ అధికారి

ప్రతి నియోజకవర్గానికి ఒక లైజన్ అధికారి ఉంటారు. ఎన్నికల పరిశీలకులు అడిగే ప్రతి ప్రశ్నలకూ వీరు వెంటనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. లైజన్ అధికారి వద్ద వారికి కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుంది.

☞ బిఎల్‌ఒలు

జిల్లాలో ఒక్కో పోలింగ్ కేంద్రానికి బూత్ లెవెల్ అధికారి ఒకరు ఉంటారు. వీరంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తుంటారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు చూడాల్సిన బాధ్యత బిఎల్‌ఒలదే. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచీ స్లిప్పులు పంపిణీ చేసే బాధ్యత బిఎల్‌ఒలదే.

☞ సెక్టోరియల్ అధికారులు

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్డి వంటి మౌలిక వసతుల కల్పన వీరి ప్రధాన బాధ్యత. ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహనతో పనిచేయాల్సి ఉంటుంది. పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరియల్ అధికారి ఉంటారు.

☞ వీడియో చిత్రీకరణ

ఒక్కో నియోజకవర్గానికి ఒక వీడియో సర్వేలెన్స్ బృందం ఉంటుంది. ఇద్దరు వీడియోగ్రాఫర్లు, ఒక రెవెన్యూ అధికారి ఇందులో ఉంటారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన అంశాలను, ఫిర్యాదులను చిత్రీకరించి నివేదికను తయారు చేసి కలెక్టర్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు పంపుతారు.

☞ ఫ్లయింగ్ స్క్వాడ్

ప్రతి మండలానికీ ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఉంటుంది. ఈ బృందాలు 24 గంటలూ అప్రమత్తంగా ఉంటాయి. అభ్యర్థుల ప్రచార ఖర్చులను నిఘా పెట్టి లెక్కిస్తారు. నిర్దేశించిన ఖర్చు దాటినట్లు అనుమానం వస్తే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారు.

☞ పోలీస్ బందోబస్తు

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్‌పి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

రమణమూర్తి ప్రచారం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని కోమర్తి పంచాయతీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిలతను కలిసి మహాశక్తి పథకాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు శిమ్మ చంద్రశేఖర్, శిమ్మ జగన్నాథం, కింజరాపు సూర్యనారాయణ, జల్లు చంద్రమౌళి పాల్గొన్నారు. పోలాకి మండలంలోని చీడివలస పంచాయతీలో నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి రమణమూర్తి, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, జనసేన నాయకులు బలగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రమణమూర్తి

తమ్మినేని విస్తృత ప్రచారం

ఓటు అభ్యర్థిస్తున్న సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జగన్మోహన్ రెడ్డి తోనే పేదలకు న్యాయం జరుగుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం మండలంలోని బప్పడాం పంచాయతీ పరిధిలోని బప్పడాం, అమృత లింగానగరం గ్రామాల్లో, పట్టణ పరిధిలోని 15వ వార్డులోని పాతినవారి వీధి, గణేష్ నగర్‌లో స్థానిక నాయకుడు పేడాడ చిరంజీవి ఆధ్వర్యంలో స్పీకర్ తమినేని సీతారాం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సిఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వం అత్యంత అవసరమన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలిపామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బప్పడాంకు చెందిన 15 కుటుంబాలు మామిడి గిరి ఆధ్వర్యంలో సీతారాం సమక్షంలో పార్టీ కండువాలను కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి శివానంద బాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, పేడాడ చిరంజీవి, బిసిసెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సతీమణుల ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

గత ఎన్నికల ముందు జగన్ వదిలిన బాణమే నేడు రివర్స్ అయిందని, సిఎం జగన్ నిరంకుశ వైఖరే ఇందుకు కారణమని టిడిపి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు సతీమణి శ్రీశ్రావ్య, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి అన్నారు. సూపర్ సిక్స్ ప్రచారంలో భాగంగా మంగళవారం ముద్దాడ రామకృష్ణ, ధనలక్ష్మి ఆధ్వర్యంలో రాజీవ్ నగర్–2, విశాఖ ఎ కాలనీల్లో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి మహిళలతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న శ్రీశ్రావ్య, స్వాతి



ఎర్రన్నాయుడు

కృపారాణి

జిల్లా నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం ఎంపీగా ఎన్నికైన వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా పనిచేశారు. 1999లో ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా 13 నెలల పాటు పనిచేశారు. 2009 ఎన్నికల్లో కింజరాపు ఎర్రన్నాయుడుపై కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించిన కిల్లి కృపారాణి కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటిశాఖ మంత్రిగా 2011 నుంచి 2014 వరకు పనిచేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించి, ఆరుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన కింజరాపు ఎర్రన్నాయుడు 1996 నుంచి 2004 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ విజయం సాధించి ఎంపీగా ఎన్నికయ్యారు. కణితి విశ్వనాథం రెండుసార్లు, కింజరాపు రామ్మోహన్ నాయుడు రెండుసార్లు, గౌతు లచ్చన్న, ఎన్.జి.రంగా, హనుమంతు అప్పయ్యదొర ఒక్కొక్కసారి ఎన్నికయ్యారు.

ఇచ్ఛాపురంలో మైనారిటీలకు అందలం

నాలుగుసార్లు గెలుపొందిన ఎం.వి కృష్ణారావు

ఎం.వి కృష్ణారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపి ఆవిర్భావం నుంచి ఎటువంటి తరగతి, ధన బలం లేకపోయినా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి ఎమ్మెల్యే కీర్తిశేషుల డాక్టర్ ఎం.వి.కృష్ణారావు. ఇచ్ఛాపురంలో వ్యాపార నిమిత్తం వచ్చి స్థిరపడిన కృష్ణారావు టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో సేవలు అందించారు. కమ్మ సామాజిక తరగతికి చెందిన కృష్ణారావుకు తొలిసారిగా అప్పటి టిడిపి అధినేత ఎన్‌టిఆర్ 983లో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారు. ఆ తర్వాత టిడిపి పార్టీలో నెలకొన్న సంక్షోభం కారణంగా మళ్లీ 1985లో జరిగిన ఎన్నికలోనూ కృష్ణారావుకు టిక్కెట్ ఇచ్చారు. నాటి ఎన్నికల్లో 35 వేలకు పైగా రికార్డు స్థాయి మెజారిటీతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికలో టిడిపి టిక్కెట్‌తో పోటీ చేసి విజయం సాధించారు. నాడు జరిగిన ఎన్నికలో మతపరమైన ప్రచారం చేశారని, ఈ ప్రచార సమయంలో ఎన్‌టిఆర్ ఉన్న రాముడు, కృష్ణుడు బొమ్మలు ఉపయోగించారని అభియోగాలతో ఆరేళ్ల పాటు ఎటువంటి ప్రత్యక్ష ఎన్నికలో పోటీ చేయకుండా ఎన్నికల కమిషన్ బహిష్కరించింది. నాడు ఈ బహిష్కరణ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశమైంది. దీంతో ఆ తర్వాత 1994లో జరిగిన ఎన్నికలో ఎం.వి.కృష్ణారావు సూచించిన అభ్యర్థిదక్కాత అచ్యుత రామయ్యరెడ్డికి టిడిపి టిక్కెట్ రావడంతో దగ్గర ఉండి గెలిపించారు. తర్వాత జరిగిన ఎన్నికలో 1999లో మళ్లీ టిడిపి టిక్కెట్ కృష్ణారావు ఇవ్వడంతో మళ్లీ గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన తరగతులు రెడ్డిక, యాదవ, కాళింగ, మత్స్యకారులు ఉన్నారు. అతి తక్కువ తరగతి బలం ఉన్న కృష్ణారావును ఇచ్ఛాపురం అక్కున చేర్చుకుంది. టిడిపి ఆవిర్భావం తర్వాత ఒకేఒక్కసారి 2004లో టిడిపి రేసులో కృష్ణారావు లేకపోవడం, మాజీ ఎమ్మెల్యే అచ్యుత రామయ్యరెడ్డి కోడలు దక్కాత ఏకాంబరిదేవి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరేష్ కుమార్ అగర్వాల్ అఖండ విజయం సాధించారు. ఈ అభ్యర్థికి నియోజకవర్గంలో తరగతి బలం లేకపోయినా టిడిపి కోటతో తొలిసారిగా పాగా వేసిన రికార్డు ఉంది. అదేవిధంగా 2009లో టిడిపి అభ్యర్థిగా పిరియా సాయిరాజ్‌కి 15 రోజులు ముందు టిడిపి టిక్కెట్ ఇవ్వడం.. తక్కువ సమయంలో విజయం సాధించారు. ప్రధాన తరగతులకు చెందిన అభ్యర్థులు కన్నా... మైనారిటీలకు చెందిన నాయకుల గెలుపులు ఎక్కువగా ఉన్నాయి.

బ్రాహ్మణతర్లా తొలి ఎమ్మెల్యే

బ్రాహ్మణతర్లా, టెక్కలి నుంచి నిచ్చెర్ల రాములు రెండుసార్లు గెలుపు

రాములు

ప్రజాశక్తి- పలాస

మాజీ ఎమ్మెల్యే నిచ్చెర్ల రాములు అంటే పలాసలో తెలియని వారు ఉండరు. ఆయన దొరల వంశంలో పుట్టిన సాధారణంగానే ఉండేవారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా, టెక్కలి నియోజకవర్గాల నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రాను రానూ రాజకీయాల్లో విలువలు లేకపోవడం, కుటిల రాజకీయాలు చేయడం చూసి రాజకీయాలకు దూరమయ్యారు. టిడిపి స్థాపించిన కీర్తిశేషులు నందమూరి తారక రామారావు జిల్లా నుంచి ఎంపీ స్థానానికి ఆయనను ఎంపిక చేసిన తృణప్రాయంగా తోసిపుచ్చారు.

గౌతు లచ్చన్నతో నిచ్చెర్ల

నిచ్చెర్ల మంగన్న, మహాలక్ష్మి దంపతులకు మొదటి సంతానం నిచ్చెర్ల రాములు. తన తండ్రి మంగన్న పొగాకు వ్యాపారంతో పాటు వ్యవసాయం చేసేవారు. ఆ సమయంలో గౌతు లచ్చన్న రాములు తండ్రి మంగన్నకు వద్దకు వచ్చి రాములని రాజకీయాలు వైపు తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి ఉన్నత మైన రాజకీయాలు చేస్తూ పలాస ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్పంచ్ ఎన్నికలు ఉండేవి కావు. ఆ సమయంలో పలాస ప్రాంతంలో మొదటి చైర్మన్ (సర్పంచ్)గా పనిచేశారు. అప్పటికే పలాస ప్రాంతం అభివృద్ధి చేసేందుకు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా గౌతు లచ్చన్నతో పాటు నిచ్చెర్ల రాములు ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు చేపట్టే వారు.

పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామం నియోజకవర్గం కేంద్రంగా ఉండేది. ఆ రోజుల్లో బ్రాహ్మణతర్ల ఒక వ్యాపార కేంద్రంగా, ఎక్కువ శాతం మంది చేనేత కార్మికులు ఉండడం, ఏ వస్తువు కావాలన్నా ఈ ప్రాంతంలో దొరకడంతో నియోజకవర్గం కేంద్రంగా ఎంపిక చేశారు. అసెంబ్లీ ఎన్నికలు 1955 జరుగ్గా ఆ సమయంలో రాజగోపాల్ ఆచారి స్థాపించిన కృషిక లోక్ పార్టీ నుంచి నిచ్చెర్ల రాములను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారు. దీంతో బ్రాహ్మణతర్ల నుంచి నిచ్చెర్ల రాములు, సిపిఐ పార్టీ నుంచి ఉప్పాడ రామారావు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక వ్యక్తి పోటీ చేశారు. ఈ పోటీలో 5,025 ఓట్లు తేడాతో ఉప్పాడ రామారావుపై నిచ్చెర్ల రాములు గెలుపొంది బ్రాహ్మణతర్ల నియోజకవర్గం నుంచి మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1955 నుంచి 1962 వరకు సుమారు ఏడేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1962 ఎన్నికల్లో బ్రాహ్మణతర్ల నియోజక కేంద్రాన్ని టెక్కలి నియోజకవర్గంగా మార్చారు. 1962 ఎన్నికల్లో కృషిక లోక్ పార్టీని స్వతంత్ర పార్టీలో (చుక్క పార్టీ) విలీనం చేశారు. స్వతంత్ర పార్టీ నుంచి నిచ్చెర్ల రాములు పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బెండి లక్ష్మీనారాయణమ్మ పోటీ చేశారు. ఆ ఎన్నికల సమయంలో వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటలో కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు మధ్య తగాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో గ్రామంలో గొడవలు, గందరగోళం నెలకొనడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నేతలు ఇరు గ్రూపుల మధ్య సమస్య పరిష్కారానికి నిచ్చెర్ల రాములును న్యాయ నిర్ణీతగా నియమించడంతో అటూ కాంగ్రెస్, ఇటూ స్వతంత్ర పార్టీ నాయకులు ఒప్పుకున్నారు. అయితే నిచ్చెర్ల రాములు పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు తప్పు చేసినట్లు తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులకు న్యాయం చేశారు. దీంతో నిచ్చెర్ల రాములు గ్రూపు చెందిన హుకుంపేట గ్రామ నాయకులు రానున్న ఎన్నికల్లో ఒక్క ఓటు వేయమని హెచ్చరించినా వినిపించుకోకుండా వెళ్లిపోయారు. సుమారు 600 ఓట్లతో తేడాతో బెండి లక్ష్మీనారాయణమ్మపై ఓటమి చెందారు. 1967 నుంచి టెక్కలి నియోజకవర్గం నుంచి మరలా కాంగ్రెస్ పార్టీ నుంచి బెండి లక్ష్మీనారాయణమ్మపై మళ్లీ పోటీ చేసి 8,947 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు.

బోరు మరమ్మతులను చేయిస్తున్న సర్పంచ్ ప్రతినిధి కామేశ్వరరావు

వినియోగంలోకి తాగునీటి బోరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధిలో పొన్నంపేటలో తాగునీటి బోరు మరమ్మతులను సర్పంచ్ ప్రతినిధి సాదు కామేశ్వరరావు మంగళవారం చేయించారు. గ్రామంలో గత కొన్నాళ్లుగా తాగునీటి బోరు మరమ్మతులకు గురై నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులకు గురవడంతో విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి సాధు కామేశ్వరరావు మరమ్మతులు చేయించి తాగునీటి బోరును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే బోరును రిపేరు చేయించడం జరిగిందన్నారు. బోరు వినియోగంలోకి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఇంటికి వెళ్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల బడిబాట

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు జెడ్పి పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. గ్రామంలో ఉన్న విద్యార్థులందరూ ఉన్నత పాఠశాలలో చేరాలని మంగళవారం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కోరారు. సోమవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 23 మంది విద్యార్థులకు 23 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు. చిన్ని రాజ్యలక్ష్మి 537 మార్కులు సాధించినట్లు చెప్పారు. పాఠశాలలో గుణాత్మక విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెఎస్ ప్రసాద్, పూజారి గోవిందరావు, కె. వెంకటరావు, ఎస్. రమేష్ బాబు, ఎస్.చంద్రశేఖర్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని భవిత పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన యు.నిహారిక 571, కె.మోహిత 570, కె.కావ్యశ్రీ 564, సిహెచ్ అజయ్ కుమార్ 561, పి.అఖిల్ 558 మార్కులు సాధించి ఉత్తమంగా నిలిచారు. ఈ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని పాఠశాల డైరెక్టర్ సువ్వారి సునీత, కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు, హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న డైరెక్టర్ సునీత

న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పిఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు పి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వం ˊరావు, మేనేజింగ్ డైరెక్టర్ రమాకుమారి, డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీదేవి అభినందనలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఉత్తమ విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ గల విద్యార్థులుగా తీర్చి దిద్దడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది హేమచరణ్ అత్యధికంగా 593 మార్కులు సాధించినట్టు తెలిపారు. మంచి మార్కులు సాధించిన వారిలో సాత్విక, అనన్య, రుచిత, సాత్విక్, నంద కిషోర్, ప్రేమ్, సూర్యచంద్రలను అభినందించారు. 500 మార్కులు పైబడిన విద్యార్థులు 52 మందిని అభినందించారు. 550 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కో-ఆర్డినేటర్లు వైవిఎస్ఎన్ మూర్తి, సరోజిని పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న జగన్మోహనరావు

విశాఖ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయి ప్రియదర్శిణి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్వర్యాన నడపబడుతున్న విశాఖ స్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థి ముద్దాడ లోకేష్ 568, బాగు పల్లవి 561, డోల భాగ్యలక్ష్మి 560, స్వాతి 558 మార్కులు సాధించారు. 60 శాతం మంది విద్యార్థులు 500 పైబడి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. గణితం, సోషల్ స్టడీస్‌లో 100 మార్కులు, సైన్స్ 98, తెలుగు, ఇంగ్లీష్‌లో 99 మార్కులు సాధించి ప్రతిభ కనపర్చారు. విద్యార్థులను స్కూల్ చైర్మన్ డా.కె.మధుసూదన్, హెచ్‌ఎం రామారావులు అభినందించారు.

ముద్దాడ లోకేష్

బాగు పల్లవి

సత్తా చాటిన 'శర్వాణి' విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్థానిక అరసవల్లి రోడ్‌లో ఉన్న 'శర్వాణి విద్యాలయం' 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. పరీక్షకు హాజరైన 51 మంది విద్యార్థుల్లో 40 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. 586 గరిష్ఠ మార్కులతో పాటు 550 మార్కులు పైబడి 21 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినందుకు శర్వాణి సంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు, కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, హెచ్‌ఎం డా.కె.రేఖ, ఉపాధ్యాయులు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు

రక్తం కొరత లేకుండా దాతల సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోగులకు, క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించే సమయంలో రక్తం కొరత లేకుండా దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ అధ్యక్షులు బరాటం సంతోష్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని విజయశ్రీ బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ట్రస్టు సభ్యులతో కలిసి ఆయన రక్తదానం చేశారు. రక్త నిల్వల కొరత ఎక్కువగా ఉందని, ప్రాణాలు విలువ తెలిసిన ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా రక్త నిల్వలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిబిరంలో విజయశ్రీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ శ్రవణ్, ట్రస్టు సభ్యులు గురునాథ్, గోవింద్, పాలకొండ ప్రశాంత్, అందవరపు సంతోష్, నాగేశ్వరరావు, మణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గౌతు శిరీష

జగ్గారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి- పలాస

బూరెల జగ్గారావు మాస్టర్ మృతి పార్టీకి తీరని లోటని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని కిష్టుపురంలో మంగళవారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్గారావు మాస్టర్ గ్రామానికి పెద్ద దిక్కుగా ఉండేవారని, ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా వారికి అండగా నిలిచేవారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేసే సమయంలో, ఉద్యోగ విరమణ తర్వాత కూడా గ్రామాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన కుమారులు బూరెల కృష్ణంరాజు, బూరెల విజయ కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, దువ్వాడ లక్ష్మీభార్గవి, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, వడ్డీ యాదగిరి పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రగతి భవన్‌లో మందస మండలం బాహడపల్లికి చెందిన యువకులు పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో మంగళవారం వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కోట జయరాం, కోట నవీన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మందస ఎంపిపి డొక్కరి దానయ్య, హనుమంతు వెంకటరావు, మందస మండల పార్టీ అధ్యక్షులు అగ్గున్న సూర్యారావు, సర్పంచ్ బొడ్డు ఉదయకుమార్, పంచాయతీ అధ్యక్షులు మామిడి తులసయ్య, ఎంపిటిసి మాజీ సభ్యులు మామిడి కృష్ణారావు, సీనియర్ నాయకులు సార దూర్వాసులు, కోట సోమేష్, కోట పురుషోత్తం, సాలిన మాధవరావు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో అప్పలరాజు

రెండు నామినేషన్లు

ప్రజాశక్తి- రణస్థలం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి రణస్థలం తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన సురవరపు రమ్య, అదే గ్రామానికి చెందిన గొర్లె కిరణ్ కుమార్ నామినేషన్ వేసినట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి. లక్ష్మణమూర్తి తెలిపారు.

రాజారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు.

పనిచేసే వారికి గుర్తింపు

ప్రజాశక్తి- పొందూరు

వృత్తి నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని తాడివలస జెడ్‌పిహెచ్ఎస్ హెచ్‌ఎం బల్ల కంటయ్య అన్నారు. మంగళవారం మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం పరిధిలో ఉద్యోగ విరమణ పొందుతున్న లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గురుగుబెల్లి రాజారావుకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, మండల బాధ్యులు రామారావు, మండల ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి భాస్కరరావు, ఉపాధ్యాయులు తమ్మినైన మురళీ, రంగారావు, లోకనాథం, మల్లేశ్వరరావు, అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి

పుస్తక దినోత్సవం

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు. వీరభద్రుడు పాల్గొన్నారు.

రెండు నామినేషన్ల దాఖలు

ఆమదాలవలస: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున మండలంలోని మర్రి కొత్తవలసకు చెందిన ముద్దాడ మధుసూదనరావు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా బూర్జ మండలం గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్ కుమార్ నామినేషన్‌లను ఆర్ఒ ఎం.నవీన్‌కు సమర్పించారు.

కొత్తపేటలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో కలెక్టరేట్ సమీపాన గల కొత్తపేటలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ మందిరం సమీపాన జరిగిన కార్యక్రమంలో సుమారు 2వేల మంది హాజరయ్యారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా శ్రావణ్ కుమార్

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస గ్రామ అమ్మ దేవస్థానం ఆలయ నిర్మాణ కర్త, స్వచ్ఛంద సేవకుడు సనపల శ్రావణ్ కుమార్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మంగళవారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

ఉత్సవాల్లో పాల్గొన్న శిరీష

శ్రీరామనవమి ఉత్సవాల్లో శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గత పది రోజులుగా నువ్వలరేవులో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మంగళవారం పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు శిరీషకు ఘనంగా స్వాగతం పలికారు. నువ్వలరేవు ఐకమత్యానికి మారుపేరుగా నిలుస్తుందని, ఏటా నువ్వలరేవు ఉత్సవాలు ద్వారా అది గ్రామస్తులు మధ్య ఐక్యత మరింత బలోపేతం అవుతుందని శిరీష అన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుప్పు ఈశ్వరరావు, దువ్వాడ జయరాం చౌదరి, ముప్పల దేవా, దువ్వాడ లక్ష్మీభార్గవి, బిజెపి సమన్వయకర్త కొర్రాయి బాలకృష్ణ, కదంబాల వెంకటరమణ, ఎ.ఉమామహేశ్వరరావు, కర్ని రమణ పాల్గొన్నారు.

సత్తా చాటిన 'గీతాంజలి'

ప్రజాశక్తి- నరసన్నపేట

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక గీతాంజలి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. భాగ్యశ్రీ 590, జాదవ్ రౌత్విక్ 587 మార్కులు సాధించారు. 550 మార్కులు పైబడిన విద్యార్థులు ఆరుగురు, 500 మార్కులు పైబడిన వారు 15 మంది ఉన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం శివ, శ్రీనివాస్, కోటి అభినందించారు.

'విజ్ఞాన విద్యానికేతన్' విజయదుందుభి

ప్రజాశక్తి- నరసన్నపేట

పదో పరీక్షా ఫలితాల్లో స్థానిక విజ్ఞాన విద్యా నికేతన్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మోనాలిసా సాహు 594 మార్కులు, పి.చరణ్‌కుమార్ 585, జె.ఈశ్వర్ 582, రాఘవేంద్ర భట్ట 582, పి.మహేష్ 579, ఐ.వైశాలినంద 567, కె.తేజేశ్వరి 566 మార్కులు సాధించారు. 550 పైబడిన వారు 10 మంది, 500 పైబడిన వారు 22 మంది విద్యార్థులు సాధించారు. వారికి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

'సెయింట్ క్లారిటీ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నరసన్నపేట

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక సెయింట్ క్లారిటీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎ.యోగి 590, ఇ.శరన్య 590, పి.సుశీల పల్లవి 589, పి.అఖిల్ 587, కె.వి.వి.విశ్వనాథ 584, పి.రామవర్షిత్ 584, ఎన్.కీర్తన 579, వై.జేసీగ్రేస్ 574, ఎం.చరణ్ 572, ఎ.షర్మిల 570, పి.ప్రవంతి 569, ఆర్.సత్యయోగి 568 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

'రవీంద్రభారతి' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పెద్దపేట వీధిలోని రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభకనబరిచారు. కింతలి ఖండ బిందు, సనపల అక్షయ ఒక్కొక్కరికి 580 మార్కులు, రేగాటి యశ్వంత్ 579 మార్కులు, అనుష్క సావంత్ 577 మార్కులు, పాతిన జానకిరామ్ 576 మార్కులు, ధర్మాన ఆమని 576 మార్కులు, తంగి దీపిక 571 మార్కులు సాధించారు. 32 మంది విద్యార్థుల్లో 500 మార్కులు పైబడి సాధించారని ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు తెలిపారు. విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.మణి అభినందనలు తెలిపారు.

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ వాసుదేవరావు

సిద్ధం సభను విజయవంతం చేయాలి

మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పలాస : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లా రూపు రేఖలు మార్చారని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రగతి భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు దిగిపోయే ముందు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. 14 ఏళ్ల సిఎంగా చంద్రబాబు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క పరిశ్రమ గాని, పోర్టు గాని, హార్బర్ కాని తెచ్చారా? అని అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నాలు చేయకపోవడంతోనే ఇక్కడి వారు వలసలు వెళ్లిపోయారన్నారు. జగన్ ఐదేళ్ల సిఎం పాలనలో శ్రీకాకుళం, విజయనగరం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించేందుకు మూలపేట పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి తీసుకొచ్చారని అన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధికి గొట్టాబ్యారేజ్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపడుతూ రానున్న కాలంలో వంశధార శివారు ప్రాంతాలకు రెండు పంటలు వేసుకునేందుకు పుష్కలంగా నీరు అందించే చర్యలు చేపట్టారని అన్నారు. ఆఫ్‌షోర్ పనులు శరవేగంగా అవతున్నాయని చెప్పారు. పలాసలో 200 పడకల ఆస్పత్రి, రూ.700 కోట్లతో శుద్ధ జలాల ప్రాజెక్టు తీసుకొచ్చామన్నారు. సిద్ధం సభ బస్సుయాత్రలో భాగంగా టెక్కలిలో బుధవారం సభ నిర్వహిస్తున్నారని, వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలనికోరారు. ఈయనతో పాటు హనుమంతు వెంకటరావు మాస్టర్ ఉన్నారు.

వడదెబ్బకు గురికావద్దు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అనిత వడదెబ్బ, లక్షణాలు, జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్యలో తిరగరాదని అన్నారు. వడదెబ్బ లక్షణాలు చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం అపస్మారకస్థితిలోకి వెళ్లిపోతారని అన్నారు. తరచూ నీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో ఎండలోకి వెళ్లేటప్పుడు టోపీ, తెలుపు, కాటన్ దుస్తులు ధరించాలని, గొడుగు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీనిని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అవని

మెళియాపుట్టి : వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని మెళియాపుట్టి, చాపర పిహెచ్‌సి వైద్యాధికారులు హేమంత లక్ష్మి, గ్రీష్మ అన్నారు. పిహెచ్‌సి ఆవరణలో ఉపాధి కూలీలకు వడ దెబ్బపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సందర్భంలో బయటకురావద్దని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడు గాలులు వీస్తాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పావని, అలేఖ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సన్మానిస్తున్న సిఐ ఇమ్మాన్యుల్‌రాజు

విద్యార్థులకు అభినందనలు

ఇచ్ఛాపురం : పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి అభినందించారు. ఈ మేరకు స్కూల్ ఆవరణలో అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేశారు. విద్యార్థుల తిప్పన రాజు, డి.లక్ష్మీనరసింహారెడ్డి, తిప్పన మాధవి, డబ్బురి పవిత్ర, ఉపాధ్యాయులకు సిఐటి టి.ఇమ్మాన్యుల్‌రాజు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు అవిరళ కృషి వల్లే మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. సిఐ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ డి.ఇందిరారెడ్డి, మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, శ్రీధర్, రాజ్యలక్ష్మి, శాంతిపాత్రో పాల్గొన్నారు.

'ప్రయివేట్' విద్యార్థుల హవా

టెక్కలి: టెక్కలిలోని పలు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు తమ ప్రతిభని కనబరిచారు. బిఎస్‌జెఆర్ ఉన్నత పాఠశాల్లో టి.గోమతి 569 మార్కులు రావడంతో కరస్పాడెంట్ కోత మురళీధర్, ప్రిన్సిపాల్ అనూప్‌లు అభినందించారు. ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారని కరస్పాడెంట్ నౌపడ సింహాచలం తెలిపారు. వీరిలో ఎన్.1శోక్ 556 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. అమ్మఒడి పాఠశాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. పి.ఉదయశ్రీ 588 మార్కులు సాధించడంతో కరస్పాడెంట్ బరాటం శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఆర్‌సిఎం పాఠశాలకు చెందిన టి.చంద్రిక 587 మార్కులు సాధించింది. అరుణ పాఠశాలకు చెందిన డి.అంకిత 584 మార్కులు సాధించడంతో ప్రధానోపాధ్యాయులు డి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాలకు చెందిన జి.దోన 590 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. మరద థెరిసా పాఠశాలకు చెందిన చెందిన టి.మౌనిక 561 మార్కులు సాధించారు.

'శ్రీజ్ఞానజ్యోతి'లో ఉత్తమ ఫలితాలు

నరసన్నపేట : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిలో తర్ర పవన్ కుమార్ 587 మార్కులు, పల్లా రవి వర్మ 586 మార్కులు, సావుకారి చరిస్మా 584 మార్కులు, కొండపల్లి నందిని 582 మార్కులు, చల్ల శిరీష 580 మార్కులు సాధించారు. అలాగే 550 మార్కులు దాటిన విద్యార్థులు 27, 500 మార్కులు దాటిన విద్యార్థులు 45 మంది ఉన్నారు. వీరికి స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు బోర రామారావు, పోగొట్టి లక్ష్మి, భాస్కరరావు, తర్ర సత్యనారాయణ అభినందించారు.

అభినందనలు తెలుపుతున్న స్కూల్ యాజమాన్య ప్రతినిధులు

పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

సిద్ధం సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 24న సిద్ధం సభ నిర్వహిస్తున్నామని నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని లక్కువరం సమీపంలో బిఎస్ అండ్ జెఆర్ డిగ్రీ కళాశాల పక్క సిద్ధం సభ మైదానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సభ లక్ష మందికి సరిపడ విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అభిమానులు పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, అధ్యక్షులు మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయకుమార్, బమ్మిడి తులసీరావు పాల్గొన్నారు.

రవాణా కార్యాలయం తరలింపునకు యత్నం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో దశాబ్దాలుగా సేవలు అందిస్తూ వస్తున్న రవాణా శాఖ కార్యాలయం కంచిలి మండలానికి తరలించడానికి యత్నిస్తున్నారు. దీంతో పట్టణ వాసులు, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రయివేటు బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హెడ్ క్వార్టర్స్‌లో ఉండాల్సిన రవాణా శాఖ కార్యాలయాన్ని కంచిలి మండలానికి తరలించవద్దని అసోసియేషన్ అధ్యక్షులు కట్టా సూర్యప్రకాష్ జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, రవాణాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న కార్యాలయం తరలిస్తే ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం, కవిటి మండలాల ప్రజలకు అనేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. నియోజకవర్గం కేంద్రంలోనే కార్యాలయం ఉండాలన్నారు. ఉన్నత అధికారులు స్పందించి పునపరిశీలించాలని కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆంగ్లంపై నైపుణ్యం పెంచుకోవాలి

మెళియాపుట్టి : ఆంగ్లంపై నైపుణ్యం పెంచుకోవాలని నడసంద్ర పాఠశాల హెచ్ఎం రమేష్ చౌదరి అన్నారు. పాఠశాల ఆవరణలో ఆంగ్ల భాషలో రచయిత విలియం షేక్స్‌పియర్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు ధర్మారావు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో ఆంగ్ల భాష అనివార్యమని అన్నారు. ఇంగ్లీష్ క్లబ్‌ను విద్యార్థులతో ఏర్పాటు చేసి ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై పట్టు సాధించవచ్చునని అన్నారు. భవిష్యత్‌లో అనేక ఉద్యోగ అవకాశాల్లోనూ, ఇంటర్వ్యూల్లోనూ విజయం సాధించి అవకాశం ఉంటుందని అన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు సంధ్యారాణి, రామలక్ష్మి, అతుల్య, ధర్మారావు, సామల్, నాగేశ్వరావు, జీవన్, కల్పన పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

టెక్కలి: బాల్య వివాహాలు చేస్తే తల్లికి, పుట్టిన బిడ్డ అనారోగ్యానికి గురవుతారని లింగాలవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సాయితేజ, భాగ్యశ్రీ అన్నారు. పట్టణంలోని ఆదిఆంధ్రావీధిలో మంగళవారం బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల అవాంఛిత గర్భాలు దరిచుట, రక్తహీనత వంటి సమస్యలతో ఇబ్బందులు పడతాయని అన్నారు. బిడ్డకు, గర్భిణికి జరగబోయే నష్టాల గురించి వివరించారు. ఐసిడిఎస్ పిఒ పి.శోభారాణి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి అభ్యర్థిగా కూన రవికుమార్ నామినేషన్ దాఖలు చేసారు. మంగళవారం ఉదయం పట్టణ శివారులో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి బయలుదేరి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. అలాగే ఆయన భార్య కూన ప్రమీల ఒక సెట్ డమ్మీ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని, ప్రజలు ఇప్పటికే సైకిల్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనెపు రామకృష్ణ, నేతింటి జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను ఆర్ఓ నవీన్‌కు అందజేస్తున్న రవికుమార్

పవన్‌ను కలిసిన దానేటి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను శ్రీకాకుళం జిల్లా జనసేన నాయకులు, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పిఠాపురం నామినేషన్ వేస్తున్న పవన్‌ను కలుసుకుని అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై దానేటి కాసేపు పవన్ కళ్యాణ్‌తో చర్చించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి గెలుపు ఖాయమని, జనసేన పార్టీ నాయకులు సైనికుల్లా పని చేసి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను బలపరుస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని, పార్టీని నమ్ముకున్న వారికి ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు.

వెంకటేష్‌ను సత్కరిస్తున్న సూరిబాబు

సివిల్స్ విజేత వెంకటేష్‌కు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయంలో మంగళవారం సివిల్ విజేత బాన్న వెంకటేష్‌ను సత్కరించారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు హాజరై ఆయనకు శాలువ కప్పి సత్కరించి అభినందించారు. వెంకటేష్ శర్వాణి విద్యాసంస్థల పూర్వవిద్యార్థి కావడం స్కూల్‌కే గర్వకారణ మన్నారు. జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన వెంకటేష్ ఎంతో క్రమశిక్షణ గల విద్యార్థి అని గుర్తు చేసుకున్నారు. ఆయన కృషి, పట్టుదల ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడిందన్నారు. హెడ్మాస్టర్ డాక్టరు కె.రేఖ మాట్లాడుతూ వెంకటేష్‌ను సన్మానించడం ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ కలుగుతుందన్నారు. కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో జిల్లా నుంచి ఐఎఎస్‌కు ఎంపికైన రోణంకి గోపాలకృష్ణ, చల్లా కళ్యాణిలను సత్కరించుకున్నామని గుర్తు చేశారు. విజేతగా నిలిచిన వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శర్వాణి స్కూల్లో నేర్చుకున్న క్రమశిక్షణ, ఫౌండేషన్ వలన ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. నాటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో చదివి పదోతరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థినులను మంగళవారం ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావులు అభినందించారు. వావిలపల్లిపేటలోని ఎపి మోడల్‌స్కూల్‌లో చదవి 590 మార్కులు సాధించిన ఆనెం పవిత్రను, కింతలి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో చదవి 590 మార్కులు సాధించిన కూన నాగలక్ష్మిలకు స్వీట్స్ తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అందుకు ఈ ఫలితాలే తార్కాణమన్నారు. వీరితో పాటు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్, కింతలి జెడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం గోవిందరాజులు పాల్గొన్నారు.

నాగలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న ఎంఇఒ రామరాజు

కాంగ్రెస్‌లో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం, లేబర్ కాలనీకి సంబంధించి 50 కుటుంబాలు కాంగ్రెస్ నాయకులు బద్రి సీతమ్మ ఆధ్వర్యాన కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు సమక్షంలో ఇండియా ఫోరంలో మంగళవారం చేర్చుకున్నారు. ఈ సందర్భంగా త్రినాథ్‌బాబు మాట్లాడుతూ సీతమ్మ ఆధ్వర్యాన వీరంతా కాంగ్రెస్‌లో చేరినందుకు సంతోషంగా ఉందని అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, సరళీకృత ఆర్థిక విధానాలు కాంగ్రెస్ తీసురావడంతో సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి చెందిందని అన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న త్రినాథ్‌బాబు

'దువ్వాడ'కు బి-ఫామ్ అందజేత

బి-ఫామ్ అందుకుంటున్న దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్‌కు నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ బి-ఫామ్ అందజేశారు. దీనిని స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం వీరిద్దరూ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ మరొకసారి సక్రమంగా చూసుకుని బి-ఫామ్ అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అజయ్ కుమార్, టౌన్ పార్టీ అధ్యక్షులు తమన్నగారి కిరణ్, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ శ్రీఆదిత్యలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిబిఎ మేనేజ్‌మెంట్ విభాగంలో డిజిటల్ మార్కెటింగ్ మేనేజిమెంట్ ఫెస్ట్ 'డిజిమేజ్-2024' మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'బిల్డింగ్ పిక్సెల్' సంస్థ డైరెక్టర్ దిలీప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో డిజిటల్ మార్కెటింగ్ ఎన్నో కొత్త విధానాలను సంతరించు కుంటోందని, ప్రతి సంస్థ డిజిటల్ మార్కెటింగ్‌పై ఆధార పడుతున్నారన్నారు. డిజిటల్ మార్కెటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, వాటిని విద్యార్థులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి. వేణుగోపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో బిబిఎ ప్రోగ్రాంను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. బిబిఎ విద్యార్థులు వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగావకాశాలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో జె.ప్రభాకరరావు, కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, వై.దినేష్ కుమార్, దీపిక, శ్రావణి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న దిలీప్ కుమార్

సుగర్స్‌పై ప్రకటన చేయాలి

ఆమదాలవలస : ఇప్పటివరకు జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైసిపి, టిడిపిలు చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని ఇచ్చిన హామీతోనే నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో నెగ్గుకొస్తున్నారని, పార్టీల వైఖరిపై సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో షుగర్స్‌పై కనీస ప్రస్తావన కూడా చేయకుండా రెండు పార్టీలు కూడ బలుక్కుని సుగర్స్ అంశం జోలికి వెళ్లడం లేదన్నారు. రైతులు, ప్రజలు సుగర్ అంశాన్ని ఒక ఎజెండాగా ప్రకటించాలని మోహనరావు కోరారు. చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి, రైతులకు అధిక ప్రయోజనాలు చేకూరుతాయని అభిప్రాయపడ్డారు. అలాగే పట్టణంలో చిరు వ్యాపారాలు జరిగి కళకళలాడుతూ ఉపాధి అందరికీ కలుగుతుందన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో శ్రీకాకుళం, ఆమదాలవలసలో పర్యటిస్తున్న వైసిపి, టిడిపి నేతలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు తమ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చి ప్రజల మధ్య ప్రకటించాలని మోహనరావు కోరారు.

ఎన్నికల పరిశీలకులు రాక

శ్రీకాకుళం : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు (జనరల్ అబ్జర్వర్)గా హర్యానాకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి శేఖర్ విద్యార్థి మంగళవారం జిల్లాకు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన కలెక్టర్ అనంతరం జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై వివరించారు. ఆశిష్ విద్యార్థి శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి శేఖర్ విద్యార్థి సాధారణ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారు. ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ గణపతిరావు, ఆర్‌డిఒ రంగయ్య తదితరులున్నారు.

పార్టీలో చేరిన వారితో ధర్నా

ధర్మాన నాయకత్వంలో పనిచేస్తాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

గార మండలంలో పలువురు టిడిపి నాయకులు మంగళవారం వైసిపిలో చేరారు. పెదపాడులో ఉన్న ధర్మాన పార్టీ కార్యాలయంలో వారికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపిపి పుల్లటి నాగేశ్వరరావు, మండల టిడిపి ప్రెసిడెంట్ జల్లు రాజీవ్‌తో పాటు మరో 200 మంది వైసిపిలో చేరారు. అలాగే అరసవల్లికి చెందిన యువకులు ధర్మాన సమక్షంలో వైసిపిలో చేరారు.

అచ్చెన్నాయుడుపై 23 కేసులు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కింజరాపు అచ్చెన్నాయుడుపై రాష్ట్రంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో 23 కేసులు ఉన్నాయని నామినేషన్ సందర్భంగా దఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అచ్చెన్న వద్ద రూ.2.50 లక్షల నగదు, భార్య వద్ద రూ.5 లక్షలు, కుమారుడు పేరున రూ.2 లక్షలు ఉన్నట్లు అఫిడవిట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇన్నోవా వాహనం, డైమండ్స్, బంగారు ఆభరణాలున్నట్లు పేర్కొన్నారు. తన పేరున రూ.16.14 కోట్ల విలువైన భూములు, భార్య పేరున రూ.1.92 కోట్లు విలువైన భూములు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నిమ్మడ, చిన్నవాల్తేరులో అచ్చెన్న పేరున 4.87 ఎకరాలు, భార్య పేరు మీద రూ. 3.36 కోట్లు అప్పు ఉన్నట్లు దఖలు చేశారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిఎం జగన్మోహనరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని, ఈ పర్యటనను పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావుల పర్యవేక్షణలో మనమంతా సిద్ధం బస్సుయాత్రను ముగింపు కార్యక్రమం టెక్కలిలో జరుగుతుందని తెలిపారు. గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు అందుకున్న వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

రామకృష్ణకు విసి అభినందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ ఎంసిఎ విభాగపు అధ్యాపకులు డా.జి.రామకృష్ణ, భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) ఛీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి డా.బుద్దా చంద్రశేఖర్, ఎయూ విసి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. బోధన, కంప్యూటర్ రంగంలో చేస్తున్న కృషికి ఈ అవార్డును రామకృష్ణకు హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ప్రకటించింది. దాదాపు 300 మంది పేర్లును ఈ అవార్డు కోసం తుది దశలో పరిశీలించగా డా. రామకృష్ణ పేరును న్యాయ నిర్ణేతల కమిటీ ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న సందర్భంగా డా.బిఆర్ఎయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజిని రామకృష్ణను అభినందించారు.